## డీఏ బకాయిలు చెల్లించండి

నూతన సీఎస్‌తో బీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

ఖైరతాబాద్, మే 6 : రాష్ట్రంలోని ఉద్యోగులకు డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్ గౌడ్ కోరారు. నూతన చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును మంగళవారం సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యోగుల పలు సమస్యలను ఏకరువు పెట్టారు. డీఏ బకాయిలతో పాటు విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన నగదు బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. మెడికల్ రీయంబర్స్ మెంట్ చెల్లించి తక్కువ వేతనాలు పొందుతున్న ఉద్యోగులకు అండగా ఉండాలన్నారు. సీఎస్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రమా, సలహాదారులు సుంకరి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు రామరాజు వర్మ, శ్రీనివాస్, కార్యదర్శి మహేంద్ర సాగర్, జగన్ తదితరులు ఉన్నారు.

## ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

హిమాయత్‌నగర్: యువత సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహా సభలు ఈ నెల 15 నుంచి 18 వరకు ఏపీలోని తిరుపతిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వా లు నిరుద్యోగ సమస్యలను పట్టించుకోకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నా రని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

నార్సింగి మున్సిపల్ మేనేజర్ నాగేంద్రబాబుకు సమ్మె నోటీసులు అందజేస్తున్న మున్సిపల్ కార్మిక సంఘం నేతలు

నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ అధికారిణి సత్యరత్నకు సమ్మె నోటీసులు అందజేస్తున్న ఆశవర్కర్లు

# మా డిమాండ్లు నెరవేర్చాలి

- మే 20 నుంచి సమ్మెలో పాల్గొననున్న కార్మికులు
- వేర్వేరుగా నోటీసులు అందజేసిన కార్మిక సంఘాలు

మణికొండ, మే 6 : ప్రజాక్షేత్రంలో ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న తమ కష్టానికి తగ్గ వేతనం ఇవ్వడంలో రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం చేస్తుందంటూ.. మున్సిపాలిటీ, అంగన్‌వాడీ సిబ్బంది ఈ నెల 20 నుంచి సమ్మె చేపడుతున్నట్లు మంగళవారం వేర్వేరుగా అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నార్సింగి మున్సిపాలిటీ మేనేజర్ నాగేంద్రబాబుకు మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు అందజేశారు.

అదేవిధంగా నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ అధికారిణి సత్యరత్నకు ఆశవర్కర్లు కూడా సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. ఎన్‌హెచ్ఎం ప్రవేటీకరణ ఆపాలన్నారు. ఆశ వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని హెచ్ఎన్ఏ ప్రైవేటీకరణ చేయకూడదని తీర్మానం చేసిందన్నారు.

### జాతీయ సార్వత్రిక సమ్మెకు మహిళా కార్మికులు తరలి రావాలి

హిమాయత్ నగర్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్కీం లో పని చేసే మహిళా కార్మికులు ఈ నెల 20 న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేం పావని , కన్వీనర్లు నండూరి కరుణ కుమారి, సి.హెచ్.సీతామహాలక్ష్మి, డి.కమలారెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్మిక వర్గం పోరాడి సాధిం చుకున్న కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా సవరించి కార్మిక హక్కులను హరించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు శ్రమను వెచ్చిస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేవిధంగా పనిచేస్తున్నా వీరికి కనీస వేతనాలు, గ్రాట్యుటీ, సామాజిక భద్రతా చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వాలు వివక్ష చూపడం తగదన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం తగదు

జలమండలి డీజీఎం జవహర్ అలీ

బండ్లగూడ, మే 6. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని రాజేంద్రనగర్ జల మండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జవహర్ అలీ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన ఫిల్టర్ వద్ద మంచినీటి సరఫరాను పరిశీలించారు. తాగు నీరు సరఫరా చేస్తున్న వాహనాలను తనిఖీలు చేశారు. జనరల్ ఎంట్రీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి రోజూ 170 వరకు బుకింగ్ చేస్తున్నట్టు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో నీటి సామర్థ్యాన్ని పెంచి సరఫరా చేయడం జరుగుతుందని వివరించారు. ఎక్కడైనా సిబ్బంది లేకుంటే ఆ స్థానంలో ఇతర సిబ్బందిని ఏర్పాటు చేసి పనులను నిరంతరం కొనసాగిస్తున్నామన్నారు.

సిబ్బందికి సంబంధించిన రికార్డును పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ జలమండలి డీజీఎం జవహర్ అలీ

### హైడ్రా ఆధ్వర్యంలో.. ప్రహరీ కూల్చివేత

ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా నిర్మించిన ప్రహరీని మంగళవారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఇందిరాగాంధీ సొసైటీలో రోడ్డును ఆక్రమించి ఓ వ్యాపారి భారీ గోడను నిర్మించాడు. దీంతో ఈ దారి గుండా ప్రయాణించే ప్రజలకు ఇబ్బందిగా మారింది. కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఇందిరాగాంధీ సొసైటీ ప్రజల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు భారీ పోలీసుల బందోబస్తు మధ్య ప్రహరీని జేసీబీల సహాయంతో కూల్చివేశారు. –మైలార్‌దేవ్‌పల్లి, మే 6:

### ఉచిత వేసవి శిక్షణ శిబిరాలకు విశేష స్పందన

ఉచిత వేసవి శిక్షణ శిబిరాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తుందని గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, సైన్స్ ఉపాధ్యాయులు ఎన్.మాణిక్యంరెడ్డిలు అన్నారు. అనంతరం మాట్లాడుతూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేష్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాగంటి

ఎర్రగడ్డ, మే 6: ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మంగళవారం పంపిణీ చేశారు. శంషీర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఐదు గురికి సీఎం సహాయ నిధికి సంబంధించి రూ.2లక్షల 67 వేల చెక్కులను అందజేశారు. అదే విధంగా 24 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలానగర్ మండల అధికారులు నాగమణి, కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు సంజీవ, షరీఫ్, జావేద్, దాసి శ్రీకాంత్, సయ్యద్ రసూల్, అజీమ్, బాలక్రిష్ణ, తరుణ్, రాజు, కల్యాణి, లక్ష్మి, జులేక, రాజియా, రమణ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మోడల్ కాలనీ కోసం స్థల పరిశీలన

గురుబ్రహ్మనగర్ బస్తీలో పర్యటిస్తున్న రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని గురు బ్రహ్మనగర్, బస్తీలలో మంగళవారం హైదరాబాద్ జిల్లా రెవెన్యూ హౌసింగ్, అధికారులు మంగళవారం పర్యటించారు. బస్తీలో పేదల కోసం ఇందిరమ్మ మోడల్ కాలనీ పేరుతో ఇండ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇండ్ల నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని చూడాలని షేక్ పెట్ మండల రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడంతో గురు బ్రహ్మనగర్, దుర్గాభవానీ నగర్‌లో ఇండ్ల నిర్మాణాలకు స్థానికుల అంగీకారం తీసుకున్నారు. గురుబ్రహ్మ నగర్ బస్తీలో 1.27 ఎకరాల స్థలంలో సుమారు 250 ఇండ్ల నిర్మాణం చేపట్టేందుకు అవకాశం ఉన్నట్లు హౌసింగ్ విభాగం అధికారులు గుర్తించారు. జీ ప్లస్ 3 పద్ధతిలో ఇండ్ల నిర్మాణం చేసి లబ్ధిదారులకు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ విభాగం ఎస్ ఈ విజయ్ కుమార్, షేక్‌పేట్ తహసీల్దార్ అనితారెడ్డి పాల్గొన్నారు.

## వ్యవసాయ శాస్త్రవేతల సలహాలు పాటించాలి

హమిదుల్లానగర్ గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సహకార సంఘం చైర్మన్ దవణాకర్‌గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్, మే 6 : వ్యవసాయ శాస్త్రవేతల సలహా సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని చిన్నగోల్కొండ సహకార సంఘం చైర్మన్ దవణాకర్‌గౌడ్ రైతులకు సూచించారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని హమిదుల్లానగర్ రైతు వేదికలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమానికి సహకార సంఘం చైర్మన్ దవణాకర్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేతల సలహా సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. సహకార సంఘం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తామని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత పవన్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ చీడపీడల యాజమాన్య గురించి రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శ్వేత, విస్తరణ అధికారి రాఘవేందర్,రైతులు బాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భిక్షపతి,ధన్‌పాల్‌రెడ్డి, వినయ్,పరశురామ్, చంద్రయ్య,పాండు, సాయిలు, అంజయ్య, సురేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నూతన సబ్ స్టేషన్ కోసం స్థలం కేటాయింపు

మంచిరేవుల గ్రామ సమీపంలోని ఔటర్ సర్వీసు రోడ్డు పక్కన సబ్‌స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మణికొండ,మే 6: పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని ప్రజావసరాలకు అనుగుణంగా మెరుగైన విద్యుత్ సరఫరాను అందించేందు కోసం కొత్త సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నామని విద్యుత్‌శాఖ ఏడీఈ అంబేద్కర్ అన్నారు. గండిపేట మండల పరిధిలోని మంచిరేవుల గ్రామ సర్వేనెంబరు 281లో ఎకరం భూమిని రెవెన్యూ శాఖ అధికారులు మంగళవారం విద్యుత్‌శాఖకు కేటాయించారు. దీనిలో భాగంగా సర్వే నిర్వహించి ఎకరం భూమికి సంబంధించి విద్యుత్‌శాఖ ఏడీఈ అంబేద్కర్ సమక్షంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేశ్ ఆధ్వర్యంలో పంచనామా చేసి పత్రాలను అందజేశారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏడీఈ అంబేద్కర్ మాట్లాడుతూ నగర శివారు ప్రాంతంలోని నార్సిం గి, కోకాపేట, మంచిరేవుల, గండిపేట లాంటి ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జాబితాలో ఉన్నాయని ఇక్కడ దేశ నలుమూలల నుంచి ప్రజలు వచ్చి స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు కోసం విద్యుత్‌శాఖ నుంచి రూ.5 కోట్లు మంజూరైనట్లు ఏఈడీ అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైలారం శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 25 ఏండ్ల సందర్భంగా .. పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పదో తరగతి వరకు కలిసి చదువుకున్న విద్యార్థులు 25 వసంతాలు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సవాల మధ్య మండలంలోని నర్కూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఓ ఫాంహౌస్‌లో ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కలుసుకొని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్య నేర్పించిన ఉపాధ్యాయులు హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు పుష్పలీల, ఉమామహేశ్వరి, బల్లెపుకుమార్, బి దేవేందర్,చంద్రశేఖర్, ఈశ్వరయ్యలను మెమెంటో అందజేసి సన్మానించారు. – శంషాబాద్ రూరల్

23 నుంచి ప్రణవ భక్త సమాజం

## శతాబ్ది ఉత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 6: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం శత జయంతి ఉత్సవాలు ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు సమాజం అధ్యక్షులు మోండ్ర నర్సింహ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రణవ భక్త సమాజం ఆవిర్భవించి 105 సంవత్సరాలు పూర్తిఅయిన సందర్భంగా పంచోత్తర శత జయంతి మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ శతాబ్ది ఉత్సవాలలో ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసులకు దొంగ అప్పగింత

వెంగళరావునగర్, మే 6 : ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ను అపహరించుకెళ్తున్న దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం జనగాంకు చెందిన లక్ష్మీరాం (29) సిద్దార్థానగర్‌లో నివాసం ఉంటూ వాచ్‌మెన్‌గా, డ్రైవర్ గా పని చేస్తుంటాడు. సోమవారం రాత్రి మధురానగర్ లోని రామ్ రెసిడెన్సీలోని సోదరుడి ఇంటికెళ్లి తన బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. తర్వాత బయటికొచ్చే సరికి తన బైక్‌ను ఓ దొంగ అపహరించుకెళ్తుంటే పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఓయూ ఫిజిక్స్ విభాగం హెడ్‌గా ప్రొఫెసర్ ప్రసాద్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం హెడ్‌గా ప్రొఫెసర్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని ఓయూ వీసీ చేతుల మీదుగా ప్రొఫెసర్ ప్రసాద్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు, పరిశోధిక విద్యార్థులు అభినందించారు.

### ఎంపీఈడీ పరీక్ష ఫలితాలు విడుదల

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్ సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

# న్యాయవ్యవస్థను నమ్ముకున్న వారికి న్యాయమే

మాజీమంత్రి సబితారెడ్డికి సీబీఐ కోర్టు క్లీన్‌చిట్ ఇవ్వడంతో శంషాబాద్‌లో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

బాబుల్‌రెడ్డినగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్

బండ్లగూడ, మే 6: నిస్వార్థ పాలన కోసం సబితా ఇంద్రారెడ్డి నిరంతరం కృషి చేశారని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ పేర్కొన్నారు. ఓబులాపురం మైనింగ్ కేసులో సబితా ఇంద్రా రెడ్డిని కోర్టు నిర్దోషిగా ప్రకటిస్తూ విడుదల చేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అహర్నిశలు శ్రమించే సబితా ఇంద్రా రెడ్డి అవినీతికి పాల్పడడం అసాధ్యమని తెలిపారు. లేనిపోని కేసులు బనాయించి 12 ఏళ్లుగా ఆమెను ఇబ్బందుల పాలు చేశారన్నారు.

అర్చన జయప్రకాష్, రాజేంద్రనగర్ కార్పొరేటర్

### కడిగిన ముత్యంలా..

మైలార్‌దేవ్‌పల్లి: తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసులు పెడితే అవి నిలబడవని మరోసారి నిరూపితం అయిందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. ఓబులాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ) కేసులో కడిగిన ముత్యంల మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి నిర్దోషిగా సీబీఐ కోర్టు తీర్పు ఇవ్వడం బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థను నమ్మినందుకు న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ముఖిద్‌చాంద్, రమేష్ ముదిరాజ్, రాముయాదవ్, రాజేష్‌యాదవ్, లక్ష్మి, సోమ శ్రీనివాస్‌గుప్తా, చిరంజీవి, రాజు, సరిత, మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, జగదీష్, అశోక్‌కుమార్, సునీల్, భాస్కర్, వెంకటరమణ, ఉప్పల్ శ్రీను, కార్తీక్, బి.రవి,రాజ్‌కుమార్, అరుణరెడ్డి, సింహాద్రి, సన్నీ, శివ, రిషి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మాజీమంత్రి సబితారెడ్డికి క్లీన్ చిట్ శంషాబాద్ సంబురాల్లో బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్: మైనింగ్ కేసులో మాజీ మంత్రి సబితారెడ్డికి సీబీఐ కోర్టులో క్లీన్‌చిట్ ఇవ్వడంపై శంషాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు బాణాసంచాలు కాల్చి స్వీట్లు పంచుకొని సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు మోహన్‌రావు, చక్రధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కొన్నుమొల్ల శ్రీనివాస్, చిన్నగండు రాజేందర్, జయసింహ,రాఘవేందర్‌రెడ్డి,మడపతి పరమేశ్వరి,పరంధాములు, రాచమల్ల రమేష్, పవిత్రసాగర్,హరికృష్ణలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటాం

అత్తాపూర్‌లో రంగారెడ్డి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత పర్యటన

హైదర్‌గూడలోని దేవాదాయ శాఖ భూమిలో చేపడుతున్న నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 6: కోట్ల రూపాయల దేవాలయ భూములను కబ్జాలు చేసుకున్న వాటిని తిరిగి తమ ఆధీనంలోకి తీసుకోనున్నామని దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత అన్నారు. మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి అత్తాపూర్ సీతారామ దేవాలయ భూములతో పాటు అనంత పద్మనాభ స్వామి దేవాలయ భూములను పరిశీలించారు. దేవాలయానికి సంబంధించి భూములు కబ్జాలకు గురయ్యాయని వారిని గుర్తించడం జరిగిందని తెలిపారు. కోట్ల రూపాయలు విలువ కలిగిన దేవాదాయ శాఖ భూముల్లో నిర్మాణాలు చేపట్టిన వారిపై హైకోర్టులో కేసులు నడుస్తున్నామయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిత, రాజేంద్రనగర్ సర్వేయర్ శ్రీనివాస్, దేవాదాయ శాఖ అధికారులు అంజయ్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

హిమాయత్‌నగర్,మే 6: దేశంలోని కులాలు,మతాల మధ్య చిచ్చుపెట్టే మతోన్మాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.యేసు రత్నం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు.మంగళవారం హిమాయత్‌నగర్‌లో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంబించే విధానాల వల్ల భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నెల 12న ఇందిరమ్మ ఇండ్లు,డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్ పథకం తదితర పథకాలలో ఉన్న లోపాలను సవ రించి అర్హులైన వారికి వర్తింప జేయాలని డిమాండ్ చేస్తూ జరిగే ఆందోళనలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

## విత్తన ఎంపికతోనే ..బంగారు పంటలు

అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

వ్యవసాయ యూనివర్సిటీ మే 6: రైతులు విత్తనం ఎంపికతోనే తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. నాణ్యత గల విత్తనం తోనే అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చని, రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) బి నరసింహారావు అన్నారు. మంగళవారం జిల్లాలోని రాజేంద్రనగర్ రైతు వేదిక వద్ద జరిగిన రైతు నేస్తం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రత్యక్ష ప్రసారం ప్రోగ్రామ్ అనంతరం,డీఏఓ తో పాటు శాస్త్రవేత్తలు ఏడీఏ కవిత పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. గతంలో లాగా మూస పద్ధతులో పంటలు సాగు చేసి ,అపార నష్టాలకు గురికాకుండా, నూతన వంగడాలు టెక్నాలజీని అందిపుచ్చుకొని, మేలైన రకాలను సాగు చేయాలని ఆయన సూచించారు. వీలైనంతవరకు సేంద్రియ ఎరువులు వాడాలని, ఏ పంట వేసినా తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధ్యమే అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో పంటలు సాగు చేస్తే వాటిని నగరంలోని అన్ని ప్రాంతాలలో ,తాజా పండ్లు కూరగాయలు ఆకుకూరలు విక్రయించి మంచి లాభాలు పొందవచ్చని ఆయన సూచించారు. ప్రధానంగా ఆయా పంటల కొరకు నాణ్యత గల విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన నాణ్యత గల విత్తనాలను కొనడం ,లేదా ప్రైవేటు వ్యక్తులతో కొనేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ విజయభారతి ,అధికారులు, శాస్త్రవేత్తలు నియోజకవర్గంలోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ లో భారీ వర్షం

## నేలకొరిగిన అనేక వృక్షాలు

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి.బండ్లగూడ తదితర ప్రాంతాలలో అనేక వృక్షాలు నేలకొరిగాయి. వర్షం కారణంగా అనేక ప్రాంతాలలో విద్యుత్ తీగలు తెగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బండ్లగూడలో కురిసిన భారీ వర్షానికి సుమారు 60 వృక్షాల వరకు నేలకొరిగినట్లు అధికారులు తెలిపారు. రాజేంద్రనగర్, బండ్లగూడ, భాగ్యనగర్ కాలనీ, గాయత్రి నగర్ కాలనీ, కిస్మత్పూర్, హిమాయత్ సాగర్, పీరంచెరువు, హైదర్ షాకోట్, గంధంగూడా, బైరాగిగూడ తదితర ప్రాంతాలలో రోడ్లపై, ఇండ్లపై వృక్షాలు పడిప